సంక్షోభంలో సంక్షేమ హాస్టళ్లు

చాలా హాస్టళ్లలో నేలపైనే నిద్రిస్తున్న విద్యార్థులు

సాక్షి గ్రౌండ్ రిపోర్టు

కైకలూరు: బాలబాలికల వసతిగృహాలు అసౌకర్యాల నిలయాలుగా మారుతున్నాయి. పెచ్చులూడుతున్న శ్లాబులు, తాగునీటి కొరత, నేలపై నిద్ర, దోమలు వంటి సమస్యలతో విద్యార్థులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. ఈ అసౌకర్యాలపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని విజయానంద్‌పై ఇటీవల అసంతృప్తి వ్యక్తం చేసింది. హాస్టళ్ల కారాగారాలను తలపిస్తున్నాయని, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఎన్‌సీపీసీఆర్) ఆదేశాలు అమలు చేయడం లేదని ఘాటుగా విమర్శించారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో హాస్టళ్ల పరిస్థితిపై కథనం.

కైకలూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఏడు బీసీ హాస్టళ్లకు గానూ 5 బాలుర, 2 బాలికల హాస్టళ్లు ఉన్నాయి. కైకలూరులో బీసీ కాలేజీ బాలికలు, బాలుర హాస్టళ్లు ఉన్నాయి. ఈ మొత్తం బీసీ వసతి గృహాల్లో 329 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 186 విద్యార్థులు, 143 విద్యార్థినులు ఉన్నారు. ఇక ఎస్సీ హాస్టళ్లు నియోజకవర్గ మండలాల్లో ఆరు ఉన్నాయి. వీటిలో 4 బాలికలు, 2 బాలుర హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో ముదినేపల్లిలో ఎస్సీ కాలేజీ బాలుర, బాలిక వసతి గృహాలున్నాయి. మొత్తం ఎస్సీ హాస్టళ్లలో 243 మంది చదువుతున్నారు. వీరిలో 130 బాలికలు, 113 మంది బాలురు ఉన్నారు. బీసీ, ఎస్సీ హాస్టళ్లలో కలిపి 572 మంది విద్యార్థులు చదువుతున్నారు. మొత్తం 1,300 మంది చదివే అవకాశం ఉన్న హాస్టల్స్‌లో కేవలం 44 శాతం మంది మాత్రమే చదువుతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.



మండవల్లి మండలంలో కళావిహీనంగా బాలికల ఎస్సీ హాస్టల్



కైకలూరు బీసీ హాస్టల్లో ఏర్పాటు చేసిన తాగునీటి క్యాన్

బాలికల హాస్టల్‌లో పాము

వసతిగృహాల్లో సమస్యలు తిష్టవేశాయి. కలిదిండి బీసీ హాస్టల్‌లో బుధవారం తాచుపాము హల్‌చల్ చేసింది. అతికష్టం మీద ఆ పామును పట్టించారు. కైకలూరు ఎస్సీ బాలికల వసతి గృహం చాలీచాలని అద్దె ఇంటిలో కొనసాగుతోంది. వర్షం కురిస్తే కింది గదుల్లోకి నీరు చేరుతోంది. ఒకటి రెండు మినహాయించి అన్ని హాస్టళ్లలో తాగునీటిని రోజూ కొనుగోలు చేస్తున్నారు. రాత్రి సమయంలో విద్యార్థులపై దోమలు దండయాత్ర చేస్తున్నాయి. కైకలూరు బాలికల కాలేజీ హాస్టల్ అద్దె భవనంలో కొనసాగుతోంది. ఇక్కడ 63 మంది విద్యార్థులకు కేవలం మూడు బాత్‌రూమ్‌లు, నాలుగు స్నానాల గదులు ఉన్నాయి. దీంతో యువతులు ఉదయం నాలుగు గంటలకే కాలకృత్యాలు ప్రారంభించాల్సి వస్తోంది. ఇటీవల విద్యార్థి సంఘ నాయకులు హాస్టల్లో వసతులు లేవని ఆందోళన చేయడం గమనార్హం.

నేలపైనే నిద్ర

ఎస్సీ వసతి గృహాల్లో నేలపైనే విద్యార్థులు పడుకుంటున్నారు. అనేక హాస్టళ్లలో దుప్పట్లు ఇప్పటికీ ఇవ్వలేదు. బీసీ హాస్టళ్లలో ట్రంకు పెట్టెలు, కాస్మోటిక్ చార్జీలు అందలేదు. సిబ్బంది విషయానికి వస్తే ఏడు బీసీ హాస్టళ్లలో కేవలం ముగ్గురు వార్డెన్లు మాత్రమే ఉన్నారు. ప్రభుత్వం నెలకు ఒక్కొక్కరికీ కాలేజీ విద్యార్థులకు రూ.1,600, ఐదు నుంచి పది వరకు రూ.1400, మూడు నుంచి నాలుగు వరకు రూ.1150 అందిస్తోంది. అంటే మూడో తరగతి విద్యార్థికి రోజుకు రూ.37 వస్తోంది. పెరిగిన నిత్యావసరాల ధరలతో మెనూ అమలు చేయడానికి వార్డెన్లు నానా తంటాలు పడుతున్నారు. ప్రభుత్వం కూరగాయలు కేజీకి రూ.20 చెల్లిస్తుండగా బయట మార్కెట్‌లో కేజీ రూ.45 కూడా పలుకుతుంది. ఇక మండవల్లి బీసీ బాలుర వసతి గృహం నుంచి పాఠశాలకు వెళ్లడానికి విద్యార్థులు రైల్వే ట్రాక్ దాటాల్సి వస్తుంది. ముదినేపల్లి ఎస్సీ కాలేజీ బాలికల హాస్టల్‌లో 7, ఎస్సీ బాలుర హాస్టల్‌లో కేవలం 9 మంది విద్యార్థులు మాత్రమే చేరారు.



కలిదిండి బీసీ హాస్టల్లో నేలపై నిద్రిస్తున్న విద్యార్థులు

ఎస్సీ హాస్టళ్లకు మరమ్మతులు



నియోజకవర్గంలో కైకలూరు, మండవల్లి, కలిదిండి, కోరుకొల్లు, ముదినేపల్లి ఎస్సీ హాస్టల్స్‌లో రూ.50,20,000తో మరమ్మతులు చేయించాం. కొన్ని చోట్ల విద్యుత్ సౌకర్యం, అడుగున చలువ రాళ్లు ఏర్పాటు చేయాలి. ముదినేపల్లిలో పాలిటెక్నిక్ కాలేజీ మూసివేయడంతో తక్కువ మంది కాలేజీ విద్యార్థులు ఉన్నారు. ఆధునికీకరించిన హాస్టళ్లలో పిల్లలను చేర్పించాలి

– బి.వెంకటరత్నమ్మ, అసిస్టెంటు సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్, కైకలూరు

హాస్టళ్లను ఆధునికీకరించాలి



మండవల్లి బీసీ హాస్టల్ విద్యార్థులు స్కూల్‌కు వెళ్లాలంటే రైల్వేట్రాక్ దాటి వెళ్తున్నారు. త్రుటిలో ప్రమాదాలు తప్పుతున్నాయి. ఈ కారణంతో హాస్టల్‌లో చేరడానికి పలువురు ఇష్టపడడం లేదు. అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేస్తే విద్యార్థులు వస్తారు. నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో హాస్టళ్లను ఆధునికీకరించాలి.

– పెరుమాళ్ల సాయికృష్ణ, విద్యార్థి, పెరికేగూడెం. మండవల్లి

క్లుప్తంగా

పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన కల్పించండి



కైకలూరు: వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులకు పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన కల్పించాలని ఆ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) పేర్కొన్నారు. ఇటీవల ఏలూరు జిల్లా పంచాయతీ రాజ్ వింగ్ కమిటీ సెక్రటరీగా మండవల్లి మండలానికి చెందిన శొంఠి వీరముసలయ్య నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో శనివారం పార్టీ కార్యాలయం వద్ద వీరముసలయ్య డీఎన్నార్‌ను కలసి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు పరింకాల వెంకటేశ్వరరావు, నాయకులు కాగిత రాజశేఖర్, శొంఠి ఆంజనేయులు, అరితి శివ పాల్గొన్నారు.

పీఏసీఎస్ అధ్యక్షుడిగా రేణుకారావు

తోట్లవల్లూరు: రొయ్యూరు పీఏసీఎస్ అధ్యక్షుడిగా లుక్కా రేణుకారావు శనివారం ప్రమాణ స్వీకారం చేసి, బాధ్యతలు స్వీకరించారు. సభ్యులుగా మోర్ల వెంకటప్పయ్య, లుక్కా నాగబాబు కూడా ప్రమాణం స్వీకారం చేశారు. పీఏసీఎస్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అధ్యక్షుడు తెలిపారు. పీఏసీఎస్ అధ్యక్షుడిగా తనను నియమించిన ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు లుక్కా వెంకటరమణ, నాయకులు లుక్కా ఓంకారం, సూరి పవన్‌కుమార్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గోకర్ణేశ్వరునికి వెండి ఆభరణాల బహూకరణ



కైకలూరు: గోకర్ణపురం గోకర్ణేశ్వరస్వామికి శృంగవరప్పాడుకు చెందిన శోభనాద్రి, కనకదుర్గ దంపతులు 10 కేజీల 869 గ్రాములతో జటాజూటం, నాగభరణ ఆభరణాలను శనివారం అందించారు. వీటి విలువ మార్కెట్‌లో రూ.14.50 లక్షలు ఉంటుంది. ఆభరణాలకు ఆలయ అర్చకులు పాలపర్తి శ్రీహరి సంప్రోక్షణ, సుగంధ పూజలు చేసి స్వామికి అలంకరించారు. దాతను ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాసు అభినందించారు. దాతల కుమారులు భార్గవ సాయికుమార్, ఈశ్వర్ మణికంఠ స్వామి పాల్గొన్నారు.

మెగా ఉచిత వైద్యశిబిరం

గుడివాడ టౌన్: స్థానిక నీలామహల్ రోడ్డులో వేంచేసియున్న శ్రీ విజయదుర్గ అమ్మవారి దేవస్థానం కాలక్షేప మండపంలో మెగా ఉచిత వైద్యశిబిరం శనివారం నిర్వహించారు. ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో విజయవాడకు చెందిన ఒమేగా హాస్పిటల్ వైద్యబృందం ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. 154 మందికి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ ఎల్‌ఈ వెంకటేశ్వరరావు, క్లబ్ అధ్యక్షుడు కె.రామారావు, కార్యదర్శి డి. శ్రీనివాసరావు, కోశాధికారి టి. రామ్మోహన్, వైద్యులు డాక్టర్ శ్వేత, డాక్టర్ అజయ్, డాక్టర్ దినేష్ రెడ్డి పాల్గొన్నారు.

తపాలా కార్యాలయానికి స్థలం వితరణ



జమీగొల్వేపల్లి(మొవ్వ): స్వగ్రామం పై మక్కువతో భారత రక్షణ శాఖ నుంచి సిపాయిగా పదవీ విరమణ చేసిన చెరుకూరి భవానీ ప్రసాద్, సుధారాణి పంపతులు జమీగొల్వేపల్లి ఉప తపాలా కార్యాలయానికి రూ.6.50 లక్షల విలువైన స్థలాన్ని వితరణగా ఇచ్చారు. ఈ మేరకు గుడివాడ డివిజన్ హెడ్ పోస్టాఫీస్‌లో ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి అప్పగించారు. ఈ స్థలంలో త్వరలో రూ.40 లక్షలతో నూతన తపాలా కార్యాలయం నిర్మించబోతున్నట్లు తపాలా శాఖ సూపరింటెండెంట్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. త్వరితగతిన నిధులు మంజూరు చేయించిన శ్రీనివాస్‌కు, స్థల దాతలైన శ్రీ భవానీప్రసాద్, సుధారాణి దంపతులకు గ్రామ ఎంపీటీసీ సభ్యుడు అరవిందబాబు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ బోధన

మండవల్లి: అనుభవం గల ఉపాధ్యాయుల ఉత్తమ బోధనలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అంగలూరు డైట్ కళాశాల బయోలాజికల్ సైన్స్ లెక్చరర్ పి.శివపార్వతి అన్నారు. లోకుమూడి జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆమె శనివారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల బోధనా తీరును పరిశీలించారు. మధ్యాహ్న భోజనం రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల సిబ్బంది కంటే ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు అనేక పరీక్షల్లో ఉత్తీర్ణులైన ప్రతిభావంతులన్నారు. హెచ్ఎం వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన చెస్ పోటీలు

గుడివాడ టౌన్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన కఠారి శ్రీనివాసరావు మెమోరియల్ చెస్ పోటీలు శనివారం ముగిశాయి. ఈ పోటీల్లో అండర్-9 విభాగంలో ఎం. దేవాన్ష్, ఐ. వేదాంత్, ఎం. పర్వాన్ష్ నాగసాయి, అండర్-11 విభాగంలో ఎం. వనోరిసమ్, పి. ఇషిత, ఆర్. వంశీకృష్ణ, అండర్-13 విభాగంలో ఎ. త్రినాధ్, డి. వేద కార్తీక్, ఎ. రహ్మాన్, అండర్-15 విభాగంలో పి. నందకిషోర్, ఎస్‌కె. సమీర్, బి. ప్రవల్లికలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించినట్లు స్టేడియం పాలకవర్గ సభ్యులు తెలిపారు. వీరితో పాటు జె. వెంకట్ సుజిత్, జె. పునీత్ కుమార్, సీహెచ్ షర్వాన్ ఆదర్శ్, ఎం. లీనా షారోన్, పి. రవి కాంత్‌లు ప్రత్యేక బహుమతులు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కె. రంగప్రసాద్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.



విజేతలతో స్టేడియం కమిటీ సభ్యులు

కాగితకు వైఎస్సార్ సీపీ నేతల నివాళులు

ముదినేపల్లి రూరల్: కాకరవాడ మాజీ సర్పంచ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కాగిత రామారావుకు పార్టీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. కాగిత ప్రథమ వర్ధంతి కార్యక్రమం గ్రామంలో శనివారం జరిగింది. పార్టీ నియోజకవర్గ నాయకుడు దూలం ఆదివినయకుమార్, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నేతలు పాల్గొని పార్టీకి, గ్రామానికి కాగిత చేసిన సేవలను కొనియాడారు. అనంతరం కాగిత చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ నాయకులు కోమటి విష్ణువర్దన్, ఎండీ గాలీబ్, ఏసుబాబు, కిషోర్, కొండా, రాము, మహేష్, రామప్రసాద్, ఏసుకుమార్, హేమంత్, నాని, నాగు, వెంకటేశ్వరరావు, లాజర్, ఫిరోజ్‌ఖాన్, గణేష్ పాల్గొన్నారు.



కాగితకు నివాళులర్పిస్తున్న నాయకులు

వెంకన్న ఆలయంలో ప్రత్యేక పూజలు

పమిడిముక్కల: మంటాడ గ్రామంలోని శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత వైకుంఠ వెంకటేశ్వర స్వామి, శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసం మొదటి శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లకు భక్తులు సమర్పించిన చీరలు, పంచెలు అధికారుల సమక్షంలో బహిరంగ వేలం నిర్వహించినట్లు ఆలయ ఈఓ హరిదుర్గా నాగేశ్వరరావు తెలిపారు. రూ.8,700లు ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సాయిపురం గ్రూపు దేవస్థానాల కార్యనిర్వహణాధికారి కేవీఎస్ సాయిబాబు, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రామోహనరావు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంపై అవగాహన సదస్సు

ముదినేపల్లి రూరల్: బొమ్మినంపాడులో మండల ఇన్‌చార్జి గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. వరిసాగులో ప్రకృతి వ్యవసాయం వల్ల చీడపీడలు, నివారణ, భూసారం పెంపొందించే విధానాలను వివరించారు. గోమాత వ్యర్థాల నుంచి తయారుచేసే క్రిమిసంహారక మందులు, ఎరువులను ఉపయోగించాలన్నారు. సాగుభూముల్లో వానపాములు అంతరించిపోకుండా రసాయనిక మందులు వాడకాన్ని తగ్గించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యకరమైన పంటల ఉత్పత్తికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని రైతులకు చేరువ చేయాలి

మండవల్లి: ప్రకృతి వ్యవసాయాన్ని అన్ని గ్రామాల్లో రైతులకు మరింత చేరువ చేసేందుకు ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో పాటు గ్రామ వ్యవసాయ సహాయకులు కృషి చేయాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటేష్ అన్నారు. ఏడీఏ జి.వెంకటమణి ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి కైకలూరు, మండవల్లి పరిధిలోని వీపీఏలకు జరుగుతున్న ప్రకృతి వ్యవసాయ శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఏడీఏ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ప్రకృతి వ్యవసాయం మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఏఓ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని మరింత చేరువ చేయడానికి జేపీలు కృషి చేయాలన్నారు. ఎన్ఎఫ్ఏ మధుబాబు, కైకలూరు ఏఓ దివ్య, టెక్నికల్ ఏఓ శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్ అగస్టిన్, హెల్త్ అండ్ న్యూట్రిషన్ సిబ్బంది, యూనిట్ ఇన్‌చార్జిలు గౌతమ్‌కుమార్, నాగవిజయ, అహోబలరావు పాల్గొన్నారు.

వాహన తనిఖీ కేంద్రం ఏర్పాటు చేయండి

గుడివాడ టౌన్: గుడివాడలో వాహన తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఆర్టీఓ కార్యాలయం వెనుక ధర్నా చేశారు. అనంతరం ఆర్టీఓ జి. బాల సుబ్రహ్మణ్యంకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం కార్పొరేట్ సంస్థ ఆధీనంలో ఉన్న ఏటీఎస్ సెంటర్‌ను గుడివాడ పట్టణానికి 60 కిలోమీటర్ల దూరంలో సౌకర్యాలు ఏమీలేని చోట ఏర్పాటు చేయడం దారుణమన్నారు. పట్టణంలో వేలాది వాహనాలు ఉన్నాయని, కృష్ణా జిల్లా లోనే అత్యధిక ట్రాన్స్‌పోర్టు వాహనాలు కలిగిన పట్టణం గుడివాడ అని పేర్కొన్నారు. వాహన యజమానుల సౌకర్యార్థం పట్టణంలో వాహన తనిఖీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ సభ్యులు కె. విజయ్‌కుమార్, ఒ. నాగేంద్ర, కె. శివయ్య, పి. సురేష్, ఆర్‌సీపీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

జెడ్పీ హైస్కూల్‌కు పూర్వ విద్యార్థుల వితరణ

కాజ(మొవ్వ): మొవ్వ మండలం కాజ గ్రామంలోని శ్రీ పీకేటి నరసారెడ్డి జెడ్పీ హైస్కూల్‌కు 1983-84 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు రూ.78 వేల విలువ గల టేబుల్స్, కుర్చీలు, మైక్ సెట్‌ను హెచ్ఎం రమణికి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులను సత్కరించి అభినందించారు. పూర్వ విద్యార్థులు పీకేటి సీతారామిరెడ్డి, బి.మురళి, మాధవరావు, శ్రీకాంత్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మురళీకృష్ణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పార్వతీమాతకు శ్రావణమాసం సారె

కైకలూరు: శ్రావణమాసం సందర్భంగా కైకలూరు శ్యామలాంబ దేవస్థానంలో పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి శివాలయంలో పార్వతీమాతకు కైకలూరు షిర్డీ సాయిబాబా మందిర కమిటీ మహిళలు శ్రావణమాస సారెను శనివారం సమర్పించారు. భక్తులకు ఆలయ ఈఓ వీఎన్‌కే.శేఖర్ స్వాగతం పలికారు.

గోపురం నిర్మాణానికి రూ.15 వేలు బహూకరణ

గుడ్లవల్లేరు: స్థానిక సంతరోడ్డులోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయ గోపుర పునర్నిర్మాణానికి, అభివృద్ధి పనులకు గుమ్మడి పాండురంగారావు, సుశీల దంపతుల జ్ఞాపకార్థం గుమ్మడి రామకృష్ణ, కుమార్తెలు రమ్య, సౌమ్య రూ.15,001ను శనివారం అందజేశారు. దాతల తరఫున గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎం విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావుకు మాజీ ఉప సర్పంచ్ అడుసుమిల్లి సుబ్బయ్య అందజేశారు.

కమ్యూనిటీ హాల్ ప్రారంభం

గుడ్లవల్లేరు: మండలంలోని అంగలూరులో నిర్మించిన మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్‌ను శనివారం మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రారంభించారు. ఎన్‌హెచ్‌పీసీ సంస్థ వారు సీఎస్ఆర్ కింద కేటాయించిన రూ.32లక్షల నిధులతో ఈ హాల్‌ను నిర్మించారు. ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవి, సర్పంచ్ మేడేపల్లి రవికుమార్, మాజీ సర్పంచ్ కొడాలి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి వితరణ

గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్డులోని విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో దేవతామూర్తుల విగ్రహాల పునర్నిర్మాణానికి భక్తులు వితరణ ఇచ్చినట్లు ఆలయ ఈఓ వై. శ్రీనివాసరావు శనివారం తెలిపారు. పట్టణానికి చెందిన భక్తులు బచ్చు సుబ్రహ్మణ్యం-సుజాత దంపతులు రూ. 10,116, దానాజీ భగవాన్ పడతారి-జయలక్ష్మి దంపతులు రూ. 10,116 అందజేసినట్లు శ్రీనివాసరావు పేర్కొన్నారు.

వెంకన్నకు మొక్కుల చెల్లింపు

గుడ్లవల్లేరు: మండలంలోని డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామికి భక్తులు తమ మొక్కులను భక్తిప్రపత్తులతో తీర్చుకున్నారు. శనివారం దూర ప్రాంతాల నుంచి భక్తుల అధిక సంఖ్యలో తరలి వచ్చారు. భక్తులకు అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు.

ఘనంగా గంగానమ్మ వార్షిక మహోత్సవాలు

నందివాడ: మండలంలోని ఇలపర్రు పంచాయతీ లక్ష్మీ నరసింహాపురం గ్రామంలో గంగానమ్మ తల్లి వార్షికోత్సవ మహోత్సవాలు సందర్భంగా శనివారం నాలుగువేల మందికి అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో వచ్చే ఈ గంగానమ్మ జాతర మహోత్సవాలు ఘనంగా జరుపుకుంటామని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో పమిడి పెంటయ్య, ఉమాదేవి, పమిడి అక్కారావు దంపతులు, నానుపాత్రుని పెద్దిరాజు దంపతులు పాల్గొన్నారు.

వసతి గృహాలు ప్రభుత్వమే నిర్వహించాలి

గుడివాడ టౌన్: బీసీ సంక్షేమ వసతి గృహాలను ప్రభుత్వమే నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.సమరం డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. బీసీ సంక్షేమ వసతి గృహాలను పి-4 ద్వారా అభివృద్ధి చేస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికే బీసీ సంక్షేమ గృహాల్లో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయన్నారు. హాస్టళ్ల స్థితిగతులు దయనీయంగా ఉన్నాయని ఉన్నత న్యాయ స్థానాలు అంటున్నాయన్నారు. అట్టి పరిస్థితుల్లో వీటి బాధ్యతను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే అవి పూర్తిగా నిర్వీర్యం అవుతాయని తెలిపారు. కావున ప్రభుత్వం ఈ ఆలోచన విరమింపజేసుకోవాలని ఆయన కోరారు.

నేడు పెన్షనర్ల సర్వసభ్య సమావేశం

గుడివాడ టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం గుడివాడ శాఖ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు భవిరి శంకర్‌నాథ్, ప్రధాన కార్యదర్శి వి. వి. మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎన్జీఓస్ హోమ్‌లో మధ్యాహ్నం మూడు గంటలకు జరిగే ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు జి. రామస్వామి, ప్రధాన కార్యదర్శి ఎ. వరప్రసాద్, ఎన్జీఓస్ మాజీ అధ్యక్షుడు బివి. సుబ్బారావు, ట్రెజరీ అధికారి జ్యోతీశ్వరరావు హాజరవుతారని పేర్కొన్నారు. అనంతరం నూతన పాలకవర్గ ఎన్నిక జరుగుతుందని తెలిపారు.

మహిళలపై వేధింపులను నివారించేందుకు అవగాహన

మొవ్వ: స్థానిక వేమూరి సుందరరామయ్య ప్రభుత్వం డిగ్రీ, పీజీ కళాశాల్లో శనివారం ఐక్యూఏసీ, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో పని ప్రదేశాల్లో మహిళలపై వేధింపుల నివారణ, నిషేధం, పరిష్కారాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేర్ మంజుల మాట్లాడారు. పీఓఎస్‌హెచ్ చట్టం 2013 మహిళలపై లైంగిక వేధింపులను నివారించేందుకు రూపొందించబడిన చట్టం అని తెలిపారు. ఈ చట్టం ప్రకారం, లైంగిక వేధింపులకు పాల్పడినవారిపై చర్యలు తీసుకోవడానికి బాధితులకు అండగా ఉంటుందని పేర్కొన్నారు.

జూద శిబిరంపై పోలీసుల మెరుపు దాడి

పామర్రు(మొవ్వ): పామర్రు పోలీస్‌స్టేషన్ పరిధిలోని నిభానపూడిలోని ఓ కాలవ గట్టుపై నిర్వహిస్తున్న జూద శిబిరంపై పామర్రు సీఐ వి.శుభాకర్ సిబ్బందితో కలిసి శనివారం మెరుపు దాడిచేశారు. ఈ దాడిలో తొమ్మిది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.1,53,000, 11 ద్విచక్ర వాహనాలు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

గుడివాడరూరల్: మండలంలోని మోటూరులో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, వెంటనే పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి జనార్దనరావుకు వినతిపత్రం అందజేసినట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార విభాగ అధ్యక్షుడు గంటా శ్రీనివాసరావు శనివారం తెలిపారు. గ్రామ పంచాయతీ చెరువులో నీటిని నింపి చర్యలు తీసుకుని తాగునీరు అందించాలని పేర్కొన్నారు. గ్రామంలో గత కొన్ని రోజులుగా తాగునీటి సమస్య ఉందని తెలిపారు. వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించాలని పంచాయతీ సెక్రటరీని కోరినట్లు పేర్కొన్నారు. ఆయన సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుడివాడరూరల్: మండలంలోని మోటూరులో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.విజయలక్ష్మి కోరారు. శనివారం ఆమె మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు ప్రవేశ పరీక్ష రాసిన వారు, రాయనివారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా సీట్లను కేటాయించనున్నట్లు ఆమె తెలిపారు.

గంజాయి అమ్ముతున్న యువకుల అరెస్ట్

గుడివాడరూరల్: గంజాయి అమ్మకాలు నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 1.3 కేజీల గంజాయిని వన్‌టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ పోలీసుల కథనం మేరకు దనియాలపేటకు చెందిన మహ్మద్ సహీంషా, మొగలి పెద్దిరాజులు, కొలుసు నాగేశ్వరరావు, ఇబ్బా శివ, పాలపర్తి జగదీష్ దనియాలపేట శివారు ప్రాంతంలో గంజాయి సేవిస్తూ దాన్ని విక్రయించడానికి ప్రయత్నించగా పోలీసులు దాడి చేసి శుక్రవారం రాత్రి అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 1.3 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. వారిని నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

తోట్లవల్లూరు: ఆపదలో ఉన్న వారికి బీవీఆర్ చారిటబుల్ ట్రస్టు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని బీవీఆర్ యూత్ అధ్యక్షుడు శ్యామ్ తెలిపారు. మండలంలోని గరికపర్రులో బొప్పూడి సావిత్రి(65) అనే పేద మహిళ అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. ట్రస్టు అధ్యక్షుడు బొమ్మారెడ్డి వెంకటరెడ్డి సహకారంతో బీవీఆర్ యూత్ అధ్యక్షుడు శ్యామ్ సావిత్రి మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించటంతోపాటు మట్టి ఖర్చుల నిమిత్తం రూ. 15 వేలను సాయంగా అందజేశారు. యూత్ కార్యదర్శి సుబ్బారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.